# తారుమారయింది

"ఓహో...లక్ష్మీ?..."

...............

ఆరునెలల చంటిపాపని చంకను అదిమి పట్టుకుని, మూడేళ్ళ అమ్మాయిని ముందు యెక్కించి—

వెనక చీరచెంగు పట్టుకుని, బండి యెక్కకుండా, వచ్చేపోయే జనాన్ని వింతగా చూస్తోన్న ఆరేళ్లవాణ్ణి- "త్వరగా ఎక్కరా!" అని గద్దిస్తూ—

రైల్వే కూలి ట్రంకుపెట్టే, తాటాకు బుట్టా లోపల పెట్టేడో లేదో చూసుకుంటూ,—

బండి ఎక్కడ కదిలిపోతుందో నని ఒకవేపు భయపడుతూ - అతిగాబరాపడి పోతున్న లక్ష్మికి - ఆ పిలుపు వినిపించనే వినిపించలేదు !

ఆ పిలిచిన ఆవిడే గబగబ వచ్చింది తలుపు దగ్గిరికి. ఒక చేత్తో పాపనితీసుకొని, మరో చేత్తో పిల్లాణ్ని లోపలకు లాక్కొని, లక్ష్మికి సాయంచేసింది ఎక్కడంలో.

"అబ్బ!...మాయదారి ప్రయాణాలని!" చేయూతనిచ్చిన ఆవిడెవరో చూడకుండానే, తన ప్రయాణాన్ని తనే తిట్టుకుంటూ విసుగ్గా వెళ్లి కూర్చుంది పక్క బెంచీమీద!

"ఏం...లక్ష్మీ?..." మరింత ఆత్రుతగా పలకరించిందావిడ, ఎదటిబల్లమీద కూర్చుంటూ.

"ఎవరూ?.. "అన్నట్టుగా నిర్ఘాంతంగా చూస్తూ వుండిపోయిందీవిడ!

"డబ్బులండీ, అమ్మగారూ!" - రైల్వే కూలీ బయటనుంచి అదేసమయాన అడిగేసరికి, అది జ్ఞాపకంవొచ్చి, అటుతిరిగి, డబ్బులందించింది.

మళ్ళీ ఇటుతిరిగి, తన పాపను తీసుకుందామని ఆమె వేపు చూసింది.

ఆమె మటుకు ఇంకా తనవేపే చూస్తోంది. చటుక్కున జ్ఞాపకంవొచ్చి, మళ్ళీ ఆలోచనలో పడింది, "ఎవరు చెప్మా!" - అనుకుంటూ

"జ్ఞాపకం లేదూ?...కనుక్కో... చూద్దాం!" - చిరునవ్వుగా ప్రశ్నించిందామె.

మళ్ళీ ఒక్కక్షణం ఎగాదిగా చూసింది లక్ష్మి. వెంటనే అనేసింది: "ఓ...నువ్వా కాంతం?...అబ్బ! ఎంతకాలానికి కనిపించావ్!..." ఇక వెంటనే ఆమె భుజాలమీద చేతులేసింది, ఏదో సంతోషాన్ని ఆపుకోలేక!

"ఎంతసేపటికీ గుర్తుపట్టలేకపోయావు సుమా!" - యింకా అంది ఆ సంతోషంతోనే!

"నువ్వే నయం, వెంటనే గుర్తుపట్టావు, పైగా - మంచి సాయం చేశావు!...ఆఁ... ఏమిటీ సంగతులు? ఎక్కడికీ ప్రయాణం? ...పూర్తిగా మారిపోయావు సుమా!"— యింకా ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపించేసింది లక్ష్మి.

ఈమె ఆనందంకొద్దీ అడిగేస్తూనే వుంది; ఆమె ఆనందంకొద్దీ అలాగే చూస్తూనే వుండిపోయింది, కొంతసేపటిదాకా!

ఇక ఇద్దరూ ప్రసంగాలు ప్రారంభించారు. ఒకరు అడిగే ప్రశ్నకు రెండో వారిచ్చే జవాబు పూర్తి అయీఅవటంతోనే, మరొక ప్రశ్న వచ్చిపడేది. కాగా, ఒక్కొక్కప్పుడు - ఇద్దరి నోళ్ళనుంచీ ఒకేసారి ప్రశ్నలు రావడంగూడా జరిగింది!

ఇద్దరూ అంత ఆరాటపడిపోయారు, అందిన ఆ ఆకస్మికానందానికి; అనుకోని ఆ కలయికకు!

కాంతమ్మ వొళ్లో పాపని ముద్దాడుతూ, "ఎన్నో నెలా పాపకి?" అని అడిగింది.

"మొన్న పున్నానికి ఆరో నెల వచ్చింది."

"ఈ ముగ్గురా సంతానం?..."

"అవును, ఈ ముగ్గురే!...నీకు?..."

"నాకా?...అయ్యో!..." - అంతవరకూ అనడంతోనే ఏదో అవమానం గలిగి, అదో బాధతో, తలవొంచుకుంది; వొళ్ళో వున్న పసిపాప ముంగురుల్ని సవరిస్తూ.

"నువ్వు అదృష్టవంతురాలివి, లక్ష్మీ!"- ఆఖరికి అనలేక అనలేక అంది, అదో గాద్గదికంగా!

"ఏమిటో, అలా అంటారుగానీ, పిల్లలుండడం అదృష్టంగాదు కాంతం! అంతకన్నా దురదృష్టం మరేదీ లేదనుకో!" అంది లక్ష్మి.

తనకు బిడ్డలులేరనే దుఃఖం కలగకుండా వుండేటందుకు గాబోలు లక్ష్మి అలా అంటూన్నదనుకుని మరింత దుఃఖపడింది— కాంతం!

"అబ్బ!...పిల్లల్తో వల్లమాలిన యాతన పడుతున్నాను. చూశావా, యిప్పుడు? అమ్మకు వచ్చే ప్రాణంగా పోయే ప్రాణంగా వుందని టెలిగ్రాం వచ్చింది. ఆయనగారు తాసీల్దారుగారితో కలిసి క్యాంపు వెళ్లారు. ఏం...చేయనిక? అందర్నీ వెంటబెట్టుకుని పరుగెడుతున్నాను, ఆడదాన్నొక్కర్తినీ!" అంటూ ఏదో యాతనగా అనేసి, కిటికీలోనుంచి వొంగిచూస్తోన్న పెద్దాణ్ణి "ఒరేయ్, పడ్తావ్...వెధవా!..." అంటూ చేయి పట్టుకుని సరిగ్గా కూర్చోబెట్టింది.

అంతచెప్పినా, కాంతమ్మకిమటుకు పిల్లలంటే అయిష్టం కలగలేదు! మళ్ళీ ఒక్కసారి, లక్ష్మినీ, లక్ష్మిపిల్లల్నీ చూసి, రైలు బ్రిడ్జిమీదనుంచి పోతూన్నప్పుడయ్యే దడదడ ధ్వని తనలోనే అయినట్టు, చివ్వున బెదిరింది; బాధపడింది!

"ఎ...లా...గై...నా" అంటూ అదే బాధతో నసిగి, కొంతసేపు మౌనంగా పసిపాప వేపు చూసి, అంతలోనే ఏదో చటుక్కున స్ఫురణకు వచ్చినట్టుకాగా,నవ్వుగా మొఖమెత్తి,- "అవును గానీ, లక్ష్మీ!... చిన్నప్పుడు నువ్వూ నేనూ యీ పిల్లలవిషయంలోనే..."పూర్తిగా అనకుండానే ఫక్కున నవ్వేసింది కాంతం!

ఆమెవేపు ఆశ్చర్యంగా చూస్తూ, ఆఖరిమాటతో అంతా అవగతం చేసుకున్నదై-

"ఆఁ......అవునవును, జ్ఞాపకం వొచ్చింది!"— అంటూ తనూ ఫకాలున నవ్వింది లక్ష్మి!

అదేదో ఇద్దరికీ స్ఫురణకు వచ్చివుండడం చేత, అందుకువచ్చిన ఆనందాన్ని ఆపుకోలేక, ఉక్కిరిబిక్కిరిగా నవ్వుతూ అవస్థపడసాగారు.

* * *

కాంతం, లక్ష్మి - ఇద్దరూ చిన్ననాటి చెలికత్తెలు. ఆ పల్లెటూళ్ళో ఇద్దరూ వేరువేరు వీధుల్లో వుండినా, ప్రొద్దస్తమానం ఒకేచోట మసలుతూ, ఒకే క్లాసులో చదువుతూ, - మిక్కిలి స్నేహంతో చక్కగా కాలం వెళ్లబుచ్చేవారు.

ఇద్దరూ బళ్ళో పంతులమ్మదగ్గిర నాలుగు వాచకాలవరకూ చదువుకున్నారు. పది పన్నెండు పాటలవరకూ - మంగళహారతి పాట మొదలుకొని అక్కా - బావా,

అన్నా-వొదినా పాటలు అన్నీ తుణ్ణంగా నేర్చుకున్నారు. చుప్పనాతి బుద్ధికొద్దీ, తోడివాళ్ళు యెన్ని గిల్లికజ్జాలు పెట్టాలనుకున్నా, యిద్దరూ విడిపోయేవారు గాదు! ఒకేస్థాయిలో పాడుకుంటూ వుండేవారు; ఒకే బాటలో నడుస్తూపోయేవారు! ఇద్దర్లో ఒకరు ఫలానాపని మంచిదనుకుంటే, రెండో అమ్మాయిగూడా అదే మంచిపని అనేది!...అలాగ ఒకే మాటమీద ఇద్దరూ వుండేవారు!

అలాంటిది,...ఓసారి చిన్న తమాషా జరిగింది. ఎనిమిదీ తొమ్మిదీయేళ్ళ వయస్సులున్నప్పుడే గాబోలు, ఒకనాడు - లక్ష్మి తాత బస్తీకి వెళ్ళివచ్చేటప్పుడు, లక్ష్మికోసమని ఒకరబ్బరుబొమ్మా,ఒక కుమారీశతకమూ-కొనుక్కొనివచ్చాడు. మురిసిపోతూ మనుమరాలికి యిచ్చాడు!.

"మరి,...మన కాంతానికేమి తెచ్చావ్, తాతా?" అని అడిగింది లక్ష్మి.

గతుక్కుమన్నాడు తాత. కాంతం పరాయిపిల్ల అయినా, లక్ష్మిలాంటిదే! ఆ ఇద్దరూ "తాతా, తాతా!" అంటూ వచ్చి, ఒకే విధమైన చనువుతో పేదరాసి పెద్దమ్మ కథలెన్నో చెప్పించుకుంటూంటారు. తనుగూడా ఎంతో ఆప్యాయంగా కమ్మని కథలు చెప్పుతూ, వాళ్ళ ముద్దు ముద్దు ప్రశ్నలకు మురిసిపోతూ - సమాధానాలు యిస్తూంటాడు; అయినా, లౌక్యంలో పట్టభద్రుడైన ముసిలితాతకు - బస్తీకెళ్ళినప్పుడు కాంతం సంగతే అక్కర్లేకపోయింది!

ఆ వాక్యాన్నే మళ్ళీ వుపయోగిస్తూ, "దానికెందుకులే, నువ్వు దాచుకో!" అన్నాడు తాత!

"అయితే, నాకక్కర్లేదు!" అంటూ అక్కడే పడేసి వెళ్ళిపోయింది లక్ష్మి.

కాని, ఆ బింకంతో చాలదూరం వెళ్ళలేకపోయింది; చాలసేపు విడిచి వుండలేకపోయింది! బొమ్మ అంత ముద్దొస్తోంది! పుస్తకం అట్ట అంత మురిపిస్తోంది!

"పోనీలే, చెరొకటి తీసుకుంటాం!" అనే నిర్ణయానికి వచ్చినట్టుగా చూస్తూ, మళ్ళీవెనక్కి వచ్చి, రెంటినీ చేతబట్టుకుని గబగబా పరుగెత్తింది - కాంతం దగ్గరకి.

మధ్యలో గబుక్కున ఆగింది, చిన్న ప్రశ్న పుట్టి—"కాంతానికి ఏది యిద్దాం?" అని.

"దానికేది నచ్చితే అది!" అని జవాబుగూడా వెంటనే పుట్టడంచేత, ఆ వెంటనే పరుగుసాగించింది గబగబా!

రెంటినీ కాంతం దగ్గిర వుంచి,"ఇవిగో.. మన తాత కొనుక్కొచ్చాడు. నీకు నచ్చింది తీసుకో!..."అంది.

కాంతం ఆనందానికి హద్దులేదు. రివ్వున



"ఓ...నువ్వా కాంతం"...అబ్బ ఎంత కాలానికి కనిపించావ్!"

ఆకర్షించుకున్న ఆ ఆడ రబ్బరుబొమ్మమీదికి చెయ్యి పోనిచ్చింది. కాని, ఎవరో లాగినట్టయి, ఏదో ఆలోచన తట్టగా, చటుక్కున ఆ చేయిని వెనక్కిలాక్కుని, ఒక్క క్షణం ఆలోచించి, ఆ చేతినే దానిమీదికీ దీనిమీదికీ తమాషాగా పోనిస్తూ, లాక్కుంటూ - ఆఖరికి, "నాకు పుస్తకమే కావాలి!" అంటూ తీసుకుంది. నిజంగా, తెలివైన పిల్లకాంతం!

"అయితే, నీకు యీ అమ్మాయి బొమ్మ అక్కర్లేదన్నమాట!" నిరాశగా అడిగింది లక్ష్మి. నిజంగా నిరుత్సాహమే పొందింది లక్ష్మి. ఏమంటే, తన చెలికత్తె రెండింటిలోనూ మంచిదైన అందమైన అమ్మాయి బొమ్మనే తీసుకొని, తనకు మరింత సంబరం కలిగిస్తుందనుకుంది; తనే పంచివ్వకుండా

★ తారుమారయింది ★

యిలా వేసిన తన ప్లాను పెగ్గుతుందనుకుంది లక్ష్మి! తనకంత ప్రేమగా చూపించి, అందులో ఒకటి వూరికే తీసుకోమన్నప్పుడు - చెలి కత్తెమీద మరీ సంతోషం గలిగి, అందమైన ఆ అమ్మాయి బొమ్మనే ఆ చెలికత్తెకు వుంచి వేద్దామని, - యీ ఎత్తు వేసింది కాంతం!

"నాకీ పుస్తకమే బాగుంది. చక్కగా చదువుకోవచ్చును." - పైగా కాంతం తను చేసిన పనిని చక్కగా సమర్థించుకుంది. కాని, లక్ష్మికి అర్థమయింది.

"ఈ రబ్బరుఅమ్మాయి అందంగా లేదూ?...తీసుకో. .కాంతం, ఏం ఫర్వాలేదులే,...నా యిష్టంగా నేను యిస్తున్నాను?" ప్రాధేయపడింది.

"నాకు వొద్దు...బాబూ; ... అమ్మాయిలూ, అబ్బాయిలూ అంటే నాకు పరమ అసహ్యం! ఏడుస్తారు, ఏరుగుతారు! అల్లరి చేస్తారు; అవస్థలు పెట్టుతారు! నాకు వొద్దే వొద్దు!...యాక్!..." అంది కాంతం!

"అయ్యొ, పిల్లలంటేనే యిష్టంలేదా? ఎంచక్కా లాలుబోసి, పాలిచ్చి, వుయ్యాల్లో పడుకోబెట్టి, జోలపాటలు పాడొచ్చు; ఎంచక్కా ఆడుకోవచ్చు!" అంది లక్ష్మి.

అలాగే పాపాయిల విషయంలో ఆ చెలికత్తెలిద్దరూ - నవ్వుగా వాదులాడుకున్నారు; అలాగే ఆ వాదాల బలాల్ని నిలబెట్టుకున్నారు. ఎంతోకాలం!

* * *

అలాంటి చిన్నప్పటి వాదం యీనాడు తలవని తలంపుగా యిద్దరూ కలుసుకున్నప్పుడు స్ఫురణకు వచ్చింది. అందులోనూ, ఆ ఇద్దరూ తారుమారు దశల్లో వుండగా!...అందుకే, ఇద్దరూ ఫకాలున నవ్వుకున్నారు!

ఇంకా, ఆ మధుర స్ఫురణతోనే వారిద్దరూ ప్రసంగిస్తూవుండగా, ఏదో స్టేషను వచ్చేసింది; బండి ఆగింది. కాంతం భర్త మగవాళ్ళ పెట్టెలోనించి దిగివచ్చి, "ఇక్కడ రైలు మారాలి, తొందరగా దిగు!" అన్నాడు. కాంతం మూటా పెట్టే భర్తకు అందించి, "ఇక వెళ్ళొస్తా... లక్ష్మి!" అంటూ దిగలేక దిగింది. లక్ష్మినీ లక్ష్మి పిల్లల్నీ భర్తకు పరిచయం చేసి మరింత మురిసిపోయింది; మరింత దిగాలుపడింది!

★




ఇరాస్మిక్ కంపెనీ లిమిటెడ్, లండన్‌వారి తరఫున ఇండియాలో తయారుచేయబడినవి HBP. 8-X30 TL

## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహముచ్చలు, సెగ, పవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.